క్లుప్తంగా

ఆటోడ్రైవర్ నిజాయితీ



పోలీసుల సమక్షంలో విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఆటోడ్రైవర్ అప్పారావు

రాజాం సిటీ: ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఆటోలో మర్చిపోయిన ల్యాప్‌టాప్‌ను పోలీసుల ద్వారా ఆ విద్యార్థికి అందజేసి, ఆటోడ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. స్థానిక జీఎంఆర్ ఐటీలో ఫస్టియర్ ఇంజినీరింగ్ చదువుతున్న బొడ్డేపల్లి కార్తీక్ శుక్రవారం బస్టాండ్ వైపు వెళ్తున్న ఆటో ఎక్కాడు. తొందరలో ఆటో దిగి, ల్యాప్‌టాప్‌ను మర్చిపోయి వెళ్లిపోయాడు. ఈ విషయం గమనించిన పొనుగుటివలసకు చెందిన ఆటోడ్రైవర్ ఎస్.అప్పారావు స్థానిక పోలీసులకు విషయం తెలియజేసి, ల్యాప్‌టాప్‌ను స్టేషన్‌కు అప్పగించాడు. ఎస్‌ఐ పి.నీలావతి సదరు విద్యార్థిని స్టేషన్‌కి పిలిపించి, ల్యాప్‌టాప్‌ను అందించడంతో ఆటోడ్రైవర్ నిజాయితీని అందరూ మెచ్చుకున్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



లక్ష్మీపురంలో కల్వర్టు శ్లాబ్ నిర్మిస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో పలు అభివద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పంచాయతీ నిధులు, ఉపాధి హామీ నిధుల ద్వారా మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం లక్ష్మీపురంలో సర్పంచ్ కెంబూరు తేజ వెంకటేశ్వరరావు, కరణం గోవిందరావుల ఆధ్వర్యంలో నిర్మాణ పనులు ఊపందుకోవడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వినతిపత్రం అందజేత



తహసీల్దారు రాజారావుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

బొబ్బిలి: ఐటీఐ తరగతులతో పాటు, ఐటీఐ ఇంటర్న్‌షిప్‌కు హాజరయ్యే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఎస్.రాజారావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. హాస్టల్ సదుపాయం లేకపోవడంతో దూరప్రాంత విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

చురుగ్గా రామాలయ నిర్మాణం



వన్నలిలో నిర్మాణ దశలో రామాలయం

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో రామాలయ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. సర్పంచ్ గార రమణ ఆధ్వర్యంలో ప్రస్తుతం నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. గ్రామస్తుల సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పన్న

బొబ్బిలి: మండలంలోని సీహెచ్ బొడ్డవలస ఎస్సీ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న కోరారు. శుక్రవారం ఆ గ్రామం సందర్శించిన ఆయన అక్కడి దళితులతో సమావేశమై, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దళిత వాడలో కనీస వసతులు లేకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు చొరవ తీసుకుని, తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఆయన వెంట రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వెలగాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని పలు ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. రాజాం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాల మార్పు చేపట్టనున్నామని, ఈ నేపథ్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని, బాధిత ప్రాంత ప్రజలు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



బాడంగి: ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాసమస్యల పరిష్కారానికేనని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని డొంకినివలస రైల్వేస్టేషన్ ప్రాంతంలో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో ఆయన దృష్టికి పలువురు తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గతంలో టీడీపీ హయాంలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను మాయం చేసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామానికి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు. గతంలో ఏ ఒక్క సమస్య పరిష్కారానికైనా మండల కేంద్రంలోని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు సమస్య పరిష్కారానికి సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజుల్లోనే ఆ సమస్య పరిష్కారమవుతోందన్నారు. ప్రజల బాగోగుల కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం తపిస్తారని, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ఆయన అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పథకాల పంపిణీతో జీవన ప్రమాణాలు చాలావరకు మెరుగుపడ్డాయన్నారు. ఇప్పటివరకు ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజలకు చేస్తున్న మేలను చూసి ఓర్వలేని చంద్రబాబు అండ్ కో, ఎల్లోమీడియా లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. మరోవైపు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను సీఎం చేసేందుకు ఆ పార్టీ కార్యకర్తలు తహతహలాడుతుంటే పవన్ మాత్రం చంద్రబాబును సీఎం చేసేందుకు ఆరాటపడుతున్నారని విమర్శించారు. 30 నుంచి 35 సీట్లు గెలిస్తే సీఎంగా అయ్యే అర్హత ఉంటుందని, అది కూడా గెలవలేని మనం సీఎం కుర్చీని ఆశించడం తప్పు అని ఆయన ఇటీవల జరిగిన ప్రెస్‌మీట్‌లో అనడం దేనికి సంకేతమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ చంద్రబాబు, పవన్ పొత్తు ఉంటుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఓసారి చంద్రబాబును మరోసారి చంద్రబాబు వెంటే నడవాలని ఆయన కార్యకర్తలకు ఇస్తున్న పిలుపుతో ఆ పార్టీ కార్యకర్తలే గందరగోళంలో పడిపోయారన్నారు. ఏది ఏమైనా ప్రజలు మాత్రం చంద్రబాబు, పవన్ జట్టు వెనక స్వార్థపూరిత రాజకీయ వ్యూహం గమనిస్తున్నారని, 2024లోనూ వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రభుత్వం: ఎమ్మెల్యే జోగులు



రాజాం సిటీ: తెలగవీధిలో ఓ ఇంటికి పథకాల ద్వారా జరిగిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం సిటీ: సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని తెలగవీధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వ పథకాల రూపంలో జరిగిన లబ్ధిని వివరించారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగనన్న ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లోనూ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మున్సిపల్ ఏఈ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



ఇంటింటికీ వెళ్లి, పిల్లల తల్లిదండ్రులను మోటివేషన్ చేస్తున్న ఉపాధ్యాయులు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించడం జరుగుతోందని, తద్వారా ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని పెనుబాక యూపీ స్కూల్ హెచ్ఎం జి.శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని పెనుబాక గ్రామంలో ఇంటింటికీ వెళ్లి, విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. మనబడి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారని, విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, పౌష్టికాహారం అందించడం జరుగుతోందన్నారు. వీటితో పాటు జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు కె.మధుసూధనరావు, బలరామ్మూర్తి, విజయలక్ష్మి, కామేశ్వరమ్మ, రవికుమార్, శారద తదితరులు పాల్గొన్నారు.

పాల దిగుబడి పెరిగేలా చర్యలు



మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి గోవింద్

బాడంగి: పాడిపశువుల్లో పాల దిగుబడి పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మండల పశువైద్యాధికారి వి.గోవింద్ తెలిపారు. స్థానిక పశువైద్య కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన దాణామృతం ద్వారా పాడి రైతులకు 60 శాతం రాయితీపై మిశ్రమ దాణా(గడ్డి, పోషకాహారం) పంపిణీ చేస్తున్నామన్నారు. 25 కిలోల బ్యాగు ధర రూ.395 కాగా దీనిని సబ్సిడీ(రాయితీ)పై రూ.162.50కే ఇస్తున్నామన్నారు. 8 బ్యాగులు ఓ యూనిట్‌గా పరిగణించి, ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. కనీసం 20 మంది రైతులు కోరుకున్న ఆర్‌బీకేకు వీటిని తరలిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 90 టన్నుల వరకు మిశ్రమ దాణాన్ని అందించామన్నారు. వీటిని పాడిఆవులకు పెట్టడం ద్వారా ఆరోగ్యంతో పాటు పాలదిగుబడి, వెన్నశాతం కూడా పెరుగుతుందన్నారు.

రాయితీపై గడ్డివిత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సత్యంనాయుడు

తెర్లాం: మండలంలోని కుసుమూరు గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై గడ్డివిత్తనాలు(జీలుగు, కట్టిజనుము) శుక్రవారం పంపిణీ చేశారు. ఏఓ జి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, కుసుమూరు సర్పంచ్ తెంటు సత్యంనాయుడు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులంతా సబ్సిడీపై ఇస్తున్న ఈ విత్తనాలను సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. నవధాన్యాల సాగుపై రైతులు దృష్టిసారించాలని ఏఓ తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేయడం జరుగుతోందని ఏఓ జి.మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని చాటాయివలస రైతు భరోసా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 రకాలైన జొన్నలు, సజ్జలు, సామలు, బీర, బెండ, బొబ్బర్లు, కొర్రలు అందజేయడం జరుగుతోందన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసే వరి పంటలో జీలుగు, కట్టిజనుమును వేసుకుంటే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పాగిరి అప్పలనాయుడు, వీఏఏ కెంబూరు శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, జి.సింహాచలం, రమణ తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నేడు జాతీయ లోక్‌అదాలత్

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని కోర్టు సముదాయంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. కక్షిదారులు ఈ లోక్‌అదాలత్‌కు వచ్చి, సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. సివిల్ కేసులతో పాటు బ్యాంకు తగాదాలు, ప్రి–లిటిగేషన్ కేసులు పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు.

డీఏవీ విద్యార్థుల ప్రతిభ

రాజాం: జీఎంఆర్ వరలక్ష్మి డీఏవీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో తమ ప్రతిభ కనబరిచారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో విద్యార్థిని పి.వైష్ణవి 500 మార్కులకు గాను 483 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ జి.విజయ్‌కుమార్ తెలిపారు. ఇదే స్కూల్ నుంచి 75 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

డీఎస్పీని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



డీఎస్పీ శ్రీధర్‌తో వైఎస్సార్ సీపీ నాయకులు

బొబ్బిలి: డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పుల్లూరు శ్రీధర్‌ను స్థానిక పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, తనకు కూడా నాయకులు, సిబ్బంది సహకరించాలని డీఎస్పీ కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇంటి గోపాలరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, ఎస్.రామకృష్ణ, కో–ఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో కొత్తగా నిర్మించిన గణపతి, షిర్డీసాయి, సత్యసాయి, సత్యనారాయణస్వామి, నవగ్రహ ఆలయాల్లో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు రాష్ట్ర ప్రజలంతా నిత్యం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్వీ రమణారావుతో పాటు వైఎస్సార్ సీపీ నేత వావిలపల్లి రామకృష్ణంనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

బొబ్బిలి: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక చర్చి సెంటర్ దగ్గరున్న బ్రహ్మకుమారీస్ కేంద్రంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం, యోగాపై శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విద్యాలయం బొబ్బిలి ఇన్‌చార్జ్ బీకే రాజేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఆయా అంశాల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీకే మల్లేశ్వరరావు, బీకే ప్రమీల పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న బ్రహ్మకుమారీ

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి



నిరుద్యోగ యువతను ఉద్దేశించి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం సిటీ: యువత తమకు వచ్చే ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీఐలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మెగా జాబ్‌మేళాకు హాజరైన ఆయన నిరుద్యోగ యువతను ఉద్దేశించి, కాసేపు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా జాబ్‌మేళాలు నిర్వహించి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి, యువతకు శిక్షణ ఇస్తోందన్నారు. ప్రతీ నిరుద్యోగికి ఉపాధి అవకాశాలు మెరుగ్గా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిరుద్యోగులంతా ఏ చిన్న అవకావం వచ్చినా దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాకు 12 జాతీయ, బహుళ జాతీయ ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు హాజరుకావడం విశేషమన్నారు. 525 మంది నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాకు హాజరు కాగా 169 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్.గోవిందరావు తెలిపారు. మరో 17 మంది తుది రౌండ్‌లో ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, ఐఎంసీ చైర్మన్ జగన్‌మోహనరావు, సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్, ఎంప్లాయిమెంట్ అధికారిణి అరుణ, ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలుస్తోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నారని, సకాలంలో విత్తనాల పంపిణీ దగ్గర నుంచి పంట సాగు, ఎరువుల సరఫరా, పంట కొనుగోలు వరకు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేశామని, ముందస్తుగానే రైతులకు అవసరమైన వరి, పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏఓ వెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు పత్తిగుల్ల ఏక్‌నాథ్, పువ్వల వెంకటరమణ, ముల్లు సాగర్‌సాయి, కనిమెరక గణేష్ పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి

రామభద్రపురం: వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పూడి వీధి స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎ.రమాదేవి కోరారు. శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం తరగతులకు హాజరైన విద్యార్థులను ఉద్దేశించి, ఆమె కాసేపు మాట్లాడారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఆరుబయట తిరిగి, చెడు అలవాట్లకు గురికాకుండా, చదువుపై ఆసక్తి తగ్గకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. రోజుకో కార్యక్రమంతో ఈ శిక్షణ తరగతులు చాలా వినూత్నంగా ఉంటాయన్నారు. పుస్తక పఠనంతో పాటు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, స్పోకెన్ ఇంగ్లిష్ అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ గ్రంథాలయానికి విచ్చేసి, విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. అంతకుముందు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, అందులో విశేష ప్రతిభ కనబరిచిన వారిని సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా సంఘ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శిరీష

బాడంగి: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఏఓ కె.శిరీష మాట్లాడుతూ ఖరీఫ్ సీజనల్‌లో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు అవసరమైన పచ్చిరొట్ట, ఖరీఫ్ విత్తనాలను తెప్పించి, ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాలని సంఘ సభ్యులు సూచించగా, స్పందించిన ఏఓ ఇప్పటికే కొన్ని ఆర్‌బీకేల్లో పరిధిలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించి, జీలుగ, పిల్లిపెసర, కట్టిజనుము విత్తనాలు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వం 50 శాతం రాయితీపై 10 కిలోల జీలుగ విత్తనాలను రూ.395కు, 10 కిలోల కట్టిజనుము రూ.420కు, 8 కిలోలు అయితే రూ.388కు ఆర్‌బీకేల్లో విక్రయానికి సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. రైతులు రైతు భరోసా కోసం ఈ నెల 18వ తేదీలోగా అడంగల్‌ను లింక్ చేసుకోవాలని, పీఎం కిసాన్ కోసం ఈ నెల 14వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పుష్పలత, వీఏఏ తదితరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన



చిన్నారులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ శ్రీదేవి

తెర్లాం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5లోని చిన్నారులకు చేతుల పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ ఎంపీహెచ్ఎస్(ఎఫ్) రాధమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీదేవి మాట్లాడుతూ భోజనం చేసే ముందు, తర్వాత చేతులను తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతుల ద్వారా బ్యాక్టీరియా నోటి లోపలికి వెళ్లి, అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, వాటి బారినపడకుండా ఉండేందుకు చేతులను శుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అంతకుముందు చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకానికి ప్రధాని మోదీ తూట్లు



కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వేతనదారులకు వివరిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

బొబ్బిలి: ఉపాధి హామీ పథకానికి ప్రధాని మోదీ తూట్లు పొడుస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు విమర్శించారు. శుక్రవారం మండలంలోని అలజంగి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి, ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం నిర్వీర్యం చేసే తీరును వేతనదారులకు వివరించారు. ఇప్పటికే బడ్జెట్‌లో ఉపాధి హామీ పనులకు కేటాయించాల్సిన నిధుల్లో కోత విధించారన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 22వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు వేతనదారులంతా హాజరై, తమ హక్కులపై గళం విప్పాలని కోరారు.